ఇండోర్‌లో ఉత్కంఠ పోరు..

వెస్టిండీస్‌పై 14 పరుగుల తేడాతో భారత్ సూపర్ విక్టరీ

విశ్వంభర, స్పోర్ట్స్ : ఇండోర్‌లో జరిగిన భారత్, వెస్టిండీస్ మూడో టీ20లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది.

అభిషేక్ శర్మ విధ్వంసం.. భారత్‌కు భారీ స్కోరు..

భారత్ ఇన్నింగ్స్‌లో అభిషేక్ శర్మ 30 బంతుల్లో 69 పరుగులతో చెలరేగాడు. తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్ కూడా ఉపయోగకరమైన పరుగులు చేయడంతో భారత్ 223 పరుగుల భారీ స్కోరును సాధించింది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ఓపెనర్ అభిషేక్ శర్మ (69) అదిరిపోయే ఇన్నింగ్స్‌తో స్ట్రాంగ్ పునాది వేశాడు. వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకు పడుతూ బాదిన హాఫ్ సెంచరీతో భారత్ భారీ స్కోరు వైపు పయనించింది. అతని ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్ 37 పరుగులతో కీలక సహకారం అందించాడు. తిలక్ వర్మ (28)లతో పాటు ఆల్ రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20)లు కీలక పరుగులు జోడించారు. సంజు శాంసన్ (3), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1), నమన్ ధీర్ (10) తక్కువ పరుగులకే నిరాశపరిచారు. ఆఖరి ఓవర్లో అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ (13) వరుస బౌండరీలతో చెలరేగడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమర్ స్ప్రింగర్, షమర్ జోసెఫ్ తలో రెండు వికెట్లు తీశారు.

వెస్టిండీస్ పోరాటం.. చివర్లో అర్ష్‌దీప్ దెబ్బ..

224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ జట్టును భారత బౌలర్లు కట్టడి చేయడంలో సఫలమయ్యారు.అయితే భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మ్యాచ్ చివరి దశలో షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌ను బౌల్డ్ చేయడం ద్వారా వెస్టిండీస్ విజయావకాశాలను దెబ్బతీశాడు. చివరికి వెస్టిండీస్ 209/7 వద్దే ఆగిపోయింది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో గెలిచి మూడో టీ20లో విజయాన్ని అందుకుంది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన అద్భుతమైన బౌలింగ్‌కు విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (5) త్వరగానే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కమిల్ పూరన్ (42), షిమ్రోన్ హెట్మెయర్ (43) దూకుడుగా ఆడి మ్యాచ్‌ను గెలిపించే ప్రయత్నం చేసినప్పటికీ, భారత బౌలర్లు సమయానికి వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పారు. చివరి వరకు హోరాహోరీగా సాగిన ఈ పోరులో వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ కీలకమైన 3 వికెట్లు తీసి విండీస్ పతనంలో కీలక పాత్ర పోషించగా, నమన్ ధీర్ 2 వికెట్లు దక్కించుకున్నారు.

వైభవ్ సూర్యవంశీ నాలాగే ఆలోచిస్తాడు

- వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసలు

విశ్వంభర, స్పోర్ట్స్ : టీమిండియా డ్యాషింగ్ బ్యాట్స్‌మెన్, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ శైలిపై భారత మాజీ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసలు కురిపించారు. తొలి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై దాడి చేసే తనదైన దూకుడు శైలి వైభవ్‌లో కనిపిస్తోందని, అతడి ఆలోచనా విధానం సరిగ్గా తనలాగే ఉందని కామెంట్ చేశారు.

తొలి బంతి నుంచే బాదాలనే ఆలోచన..

ఢిల్లీలో జరిగిన పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సదస్సులో పాల్గొన్న సెహ్వాగ్ కీలక విషయాలను మీడియాతో పంచుకున్నారు. 'సూర్యవంశీ ఆలోచన కొద్దిగా నా లాగే ఉంటుంది.. క్రీజ్‌లోకి వచ్చాక తొలి బంతి నుంచే బౌండరీలు బాదాలనే ధైర్యం అతడిలో ఉందన్నారు. అతడు ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఇకపై అతడికి ఎలాంటి అవకాశాలు దక్కుతాయి, భారత్ తరఫున ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడనేది చాలా ముఖ్యం'అని సెహ్వాగ్ చెప్పుకొచ్చారు. క్రికెట్‌లో వయస్సు ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ.. అండర్19 వంటి ఏజ్‌కేటగిరీ టోర్నీలలో వయస్సు చూస్తారని, కానీ ఐపీఎల్, టీమిండియా తరఫున ఆడుతున్నప్పుడు వయస్సుతో సంబంధం ఉండదని సెహ్వాగ్ స్పష్టం చేశారు. కాగా, అంతర్జాతీయ క్రికెట్‌లో 17,253 పరుగులు సాధించిన సెహ్వాగ్‌తో పోలిస్తే.. 15 ఏళ్ల వయసున్న వైభవ్ ఇప్పటివరకు 8 టీ20ల్లో 186 స్ట్రైక్ రేట్‌తో 246 పరుగులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. '3840 ఏళ్ల విరాట్ కోహ్లీ ఆడుతున్నాడు, అలాగే 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా ఆడుతున్నాడు. ఇక్కడ వయసు కాదు, కేవలం ఆటతీరు, ప్రదర్శనే ముఖ్యం' అని ఆయన తేల్చిచెప్పారు.

శుభ్‌మన్ గిల్, 2027 వరల్డ్ కప్‌పై కామెంట్స్..

ఈ సందర్భంగా భారత టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను కూడా సెహ్వాగ్ అభినందించారు. ఇంగ్లండ్ పర్యటనలో సునీల్ గవాస్కర్ రికార్డును దాటి 700 పైచిలుకు పరుగులు సాధించడం, ఇటీవలి వెస్టిండీస్‌పై రెండో వన్డేలో 133 బంతుల్లో 223 పరుగులు చేసి తన కెరీర్‌లో రెండో డబుల్ సెంచరీ సాధించడం సామాన్యమైన విషయం కాదన్నారు. అలాగే, జస్ప్రీత్ బుమ్రా వంటి అగ్రశ్రేణి పేసర్లు రాణిస్తే, రాబోయే 2027 వన్డే ప్రపంచ కప్‌ను భారత్ సులభంగా గెలుచుకోగలదని సెహ్వాగ్ ధీమా వ్యక్తం చేశారు.

యునిసెఫ్ సెలబ్రిటీ సలహాదారుగా స్మృతి మంధాన!

విశ్వంభర, స్పోర్ట్స్ : భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్మృతి మంధాన కు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆమె యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ సలహాదారుగా నియమితులయ్యారు. బాలికలకు సమాన అవకాశాలు, వారి ఆరోగ్యం, సంక్షేమం, క్రీడల్లో అవకాశాలు వంటి విషయంలో యునిసెఫ్‌తో కలిసి స్మృతి పనిచేయనుంది. అంతర్జాతీయ బాలికల దినోత్సవం (సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. 'యూనిసెఫ్ ఇండియాలో సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం చాలా గర్వంగా ఉంది. క్రికెట్ ఆడుతూ పెరగడం వల్ల ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని నేను నేర్చుకున్నాను. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహంతో, ఆ అవకాశం ఒక అసాధారణమైన విషయంగా మారగలదు. పెద్ద కలలు కనేందుకు, వారి పూర్తి సామర్థ్యాన్ని అందుకొనేలా ప్రతి ఒక్కరికి అవకాశం దక్కాలి' అని స్మృతి మంధాన పేర్కొన్నారు.

బెన్ స్టోక్స్ పెద్ద మూర్ఖుడు

- దిగ్గజ ఆటగాడు బోథమ్ తీవ్ర విమర్శలు

విశ్వంభర, స్పోర్ట్స్ : ఇంగ్లాండ్ క్రికెట్ దిగ్గజాలు ఇయాన్ బోథమ్, బెన్ స్టోక్స్ మధ్య మాటల యుద్ధం మళ్లీ రాజుకుంది. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్‌ను ఉద్దేశించి ఇయాన్ బోథమ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టోక్స్‌ను స్టూపిడ్ బాయ్ ,హ్యాష్‌బీన్' అంటూ బోథమ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వివరాల్లోకి వెళితే.. బోథమ్, స్టోక్స్ ఇద్దరూ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ దిగ్గజాలే అయినప్పటికీ, గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు కొనసాగుతున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్ సన్నాహకాలపై బోథమ్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరీస్‌కు ముందు ఇంగ్లాండ్ జట్టు కనీసం ఒక్క ఫస్ట్‌క్లాస్, స్టేట్ మ్యాచ్ కూడా ఆడకపోవడాన్ని ఆయన అహంకారంగా అభివర్ణించారు. తాజాగా 'ది టైమ్స్ మ్యాగజైన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇయాన్ బోథమ్ మాట్లాడుతూ.. యాషెస్ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత ఇంగ్లాండ్ జట్టు నోసా ప్రాంతానికి వెళ్లడంపై మండిపడ్డారు. 'బెన్ స్టోక్స్ ఓ స్టూపిడ్ బాయ్.. అతడి ఆత్మప్రశంసలు నాకు అసలు నచ్చవు. తొలి రెండు టెస్టులు ఓడిపోయాక వాళ్లు బీచ్‌లకు వెళ్లి విందులు చేసుకున్నారు. మీకు డ్రింక్ చేయాలనిపిస్తే పబ్లిక్ వీధులకు వెళ్లకూడదు, వైన్‌యార్డులకు వెళ్లాలి' అంటూ బోథమ్ ఫైర్ అయ్యారు.

స్వదేశీ 5జీ సేవలకు సిద్ధమవుతున్న బీఎస్ఎన్ఎల్

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ టెలికాం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) దేశవ్యాప్తంగా తన 4జీ నెట్‌వర్క్ సేవలను విజయవంతంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలోనే నెక్స్ట్ జనరేషన్ స్వదేశీ 5జీ సేవలను ప్రారంభించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇండియా మొబైల్ కాంగ్రెస్2026 కార్యక్రమం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వివేక్ దువా మాట్లాడుతూ.. 4జీ నెట్‌వర్క్ ఆశించిన స్థాయిలో మెరుగైన సేవలు అందిస్తోందని, రాబోయే నెలల్లో దీన్ని మరింత విస్తరించి త్వరలోనే స్వదేశీ టెక్నాలజీతో 5జీ నెట్‌వర్క్‌ను తీసుకురానున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, సాంకేతిక సహకారంతో రూపుదిద్దుకుంటున్న ఈ స్వదేశీ టెలికాం మౌలిక సదుపాయాలు దేశ ప్రజలకు గర్వకారణంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా మరో 50,000 నుంచి 60,000 వరకు అదనపు మొబైల్ టవర్లను అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాది నిర్వహణ లాభం రెండంకెల వృద్ధిని సాధించే అవకాశం ఉందని వివేక్ అభిప్రాయపడ్డారు.

కస్టమర్ల కోసం ఏఐ ఫీచర్లు, పటిష్టమైన సైబర్ భద్రత..

కేవలం నెట్‌వర్క్ విస్తరణే కాకుండా వినియోగదారులకు మరింత సౌకర్యం కలిగించే సేవలు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ అనేక అత్యాధునిక డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా సంస్థ తన 'వాణి' ఆటోమేటెడ్ చాట్‌బాట్‌ను అప్‌గ్రేడ్ చేసి నెట్‌వర్క్ బ్రెయిన్‌తో అనుసంధానం చేసింది. దీని ద్వారా కస్టమర్లు తమ మాతృభాషలోనే వాయిస్ ద్వారా కనెక్షన్ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. అలాగే ప్రజలు, బ్యాంకులు, విద్యుత్, నీటి సరఫరా బోర్డుల వంటి వివిధ సంస్థలతో ఒకే స్క్రీన్‌పై చాట్ చేసేందుకు వీలుగా 'భారత్ సందేశ్' అనే ఏఐ ఆధారిత ద్విముఖ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. మరోవైపు, సైబర్ భద్రతకు పెద్దపీట వేస్తూ వినియోగదారుల డేటాను సురక్షితంగా ఉంచేందుకు 'సప్తాంగ్' సైబర్‌సెక్యూరిటీ సంస్థతో కలిసి కోర్ నెట్‌వర్క్‌లో స్వదేశీ డేటా ఫిల్ట్రేషన్ యంత్రాంతాన్ని ఏర్పాటు చేసినట్లు వివేక్ దువా స్పష్టం చేశారు. ఇదే సమయంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించే భారత్‌నెట్ ప్రాజెక్ట్ డిజిటల్ సేవలను మరింత మందికి చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

గ్రామీణ యువత సాధికారతే పసల ఫౌండేషన్ లక్ష్యం

భువనగిరిలో 32 జట్లతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

PASALA FOUNDATION
A Center For Future Achievers

విశ్వంభర, భువనగిరి: గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో ప్రోత్సహించడమే పసల ఫౌండేషన్ లక్ష్యమని సంస్థ అధినేత విక్రమ్ సాగర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఐదు రీజియన్ల పరిధిలోని 32 జట్లతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 18న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఏఐ, రోబోటిక్స్, సీఏ ఫౌండేషన్‌తో పాటు ఐఏఎస్, ఐపీఎస్ పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు సైతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజల సమగ్ర సాధికారతే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ అర్జున్ మదను, సీఈవో గోకుల్ రమణ, కార్యవర్గ సభ్యులు వై.రాజా, చిలువేరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌మార్ట్‌కు లేఖ రాసిన 1,000 మంది మాజీ ఉద్యోగులు



విశ్వంభర, బిజినెస్ బ్యూరో: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన ఐపీఓ ప్రక్రియను ఎక్కువ ఆలస్యం చేస్తుండటంతో, కంపెనీలో ఏళ్ల తరబడి పని చేసి తాము సంపాదించుకున్న స్టాక్ ఆప్షన్ల విలువ మార్కెట్లో ఎటూ కదలకుండా పడిపోయిందని మాజీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం అవుతోంది. స్విగ్గీ, అర్బన్ కంపెనీ వంటి ఇతర టెక్ సంస్థలు ఇప్పటికే పబ్లిక్ మార్కెట్లోకి వెళ్లినప్పటికీ, ఫ్లిప్‌కార్ట్ మాతృసంస్థ వాల్‌మార్ట్ మాత్రం వేచి చూసే ధోరణి అవలంబిస్తూ లిస్టింగ్‌ను మరింత వెనక్కి నెడుతోంది. దీనివల్ల ఫ్లిప్‌కార్ట్ పబ్లిక్ లిస్టింగ్ మరో 12 ఏళ్లు ఆలస్యం కానుందని వారు భావిస్తున్నారు. జూలైలో జరిగిన బైబ్యాక్ ద్వారా కేవలం 5 శాతం ఆప్షన్లకు మాత్రమే నగదు రూపం దక్కడంతో, తమ కష్టానికి తగిన ప్రతిఫలాన్ని, కూడబెట్టిన సంపదను ఎప్పుడు క్యాష్ చేసుకునే వీలుంటుందనే దానిపై స్పష్టత కోరుతూ ముఖేష్ బన్సల్ వంటి మాజీ కీలక ఉన్నతాధికారులతో పాటు సుమారు 1,000 మంది ఉద్యోగులు వాల్‌మార్ట్ బోర్డుకు సామూహిక వినతిపత్రం సమర్పించారు.

ఎలాన్ మస్క్ గుత్తాధిపత్యాన్ని భారత్ సవాలు చేయాలి



విశ్వంభర, బిజినెస్ బ్యూరో: శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్లలో (శాటిలైట్ ఇంటర్నెట్) ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ గుత్తాధిపత్యాన్ని భారత్ సవాలు చేయగలదని, ఖచ్చితంగా చేయాలని నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, యూనివర్సల్ కవరేజ్ సాధన కోసం ప్రభుత్వ వద్ద ఉన్న 145 బిలియన్ డాలర్ల యూఎస్ఓ (యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్) నిధులను తక్షణమే ఉపయోగించుకోవాలని సూచించారు. మస్క్ స్టార్‌లింక్‌తో ధీటుగా పోటీ పడేందుకు ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో వంటి భారతీయ టెలికాం దిగ్గజాలు తమ సొంత శాటిలైట్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేయడానికి ఈ భారీ నిధులను కేటాయించాలని ఆయన ప్రతిపాదించారు. సార్వత్రిక కనెక్షన్లు అందించేందుకు బీఎస్ఎన్ఎల్ తన సామర్థ్యాన్ని పెంచుకునే వరకు వేచి చూడటం కంటే, ఇప్పటికే సిద్ధంగా ఉన్న దేశీయ ప్రైవేట్ రంగానికి మద్దతు ఇవ్వడమే అత్యుత్తమ మార్గమని చెబుతూ, స్పేస్ టెక్నాలజీలో భారత్ గ్లోబల్ కింగ్‌గా నిలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

గ్రీన్ కార్డు ప్రోగ్రామ్ సస్పెన్షన్‌పై స్పందించిన ఇన్ఫోసిస్



విశ్వంభర, బిజినెస్ బ్యూరో: అర్హులైన విదేశీ కార్మికులకు గ్రీన్‌కార్డు కోసం కంపెనీలు స్పాన్సర్ చేయడానికి వీలు కల్పించే పర్మ్ కార్యక్రమం నుంచి అమెరికా తమను సస్పెండ్ చేయడంపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌స్పందించింది. ఈ నిర్ణయం తమ కార్యకలాపాలపై గణనీయమైన ప్రభావం చూపదని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ వెల్లడించింది.'ట్రంప్ సర్కారు పర్మ్ ప్రోగ్రాం నుంచి ఇన్ఫోసిస్‌ను సస్పెండ్ చేసింది. ఇది కంపెనీ కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం చూపదని భావిస్తున్నాం. అమెరికాలో సాంకేతికతకు, ఆవిష్కరణలకు, స్థానిక ఉద్యోగాల నియామకాలకే కంపెనీ పెట్టుబడులు పెడుతోంది. అమెరికాలో వర్తించే నిబంధనలకు, చట్టాలన్నింటికీ కట్టుబడి ఉన్నాం'' అని ఇన్ఫోసిస్ తెలిపింది. హెచ్ 1బీ వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కంపెనీలను అనుమతించే పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్) నుంచి మైక్రోసాఫ్ట్, టాటా, ఇన్ఫోసిస్, విప్రో సహా మొత్తం 8 దిగ్గజ ఐటీ కంపెనీలను అమెరికా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, గత కొన్నేళ్లుగా భారత ఐటీ కంపెనీల గ్రీన్ కార్డు దరఖాస్తులను గణనీయంగా తగ్గించినట్లు టెక్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ ఆర్థిక సంవత్సరం26లో టీసీఎస్ కేవలం 2 పర్మ్ దరఖాస్తులు మాత్రమే సమర్పించడం గమనార్హం.

తరలిపోతున్న విదేశీ నిధులు

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, బలపడుతున్న అమెరికన్ డాలర్, అమెరికా బాండ్ల ఈల్డ్స్ ఆకర్షణీయంగా ఉండటం భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) తాజా వివరాల ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) అక్టోబర్ నెలలో ఇప్పటివరకు భారతీయ ఈక్విటీల నుంచి ఏకంగా రూ. 44,166 కోట్లను వెనక్కి తీసుకున్నారు. సెప్టెంబర్‌లో రూ. 35,861 కోట్ల విలువైన నిధుల ఉపసంహరణల జరిగింది. దీంతో ఈ క్యాలెండర్ ఏడాదిలో భారత ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల మొత్తం నిధుల తరలింపు ఏకంగా రూ. 3.04 లక్షల కోట్లకు చేరింది. ఇది గతేడాది మొత్తం నమోదైన రూ. 1.66 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు కావడం విదేశీ నిధులు వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితిని సూచిస్తోందని గణాంకాలు పేర్కొన్నాయి. ఈ నిధుల ఉపసంహరణలను కేవలం మనదేశ పెట్టుబడి అవకాశాలపై నమ్మకం కోల్పోయినట్టు చూడకూడదని, ఇది ప్రపంచవ్యాప్తంగా క్యాపిటల్ రీఅలొకేషన్ అని నిపుణులు చెబుతున్నారు. యూఎస్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్లపై 5.2 శాతానికి పైగా రిస్క్‌ఫ్రీ రాబడి లభిస్తుండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తమ నిధులను సురక్షితమైన ప్రదేశాలకు తరలిస్తున్నారు. మరోవైపు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, ఇతర మార్కెట్లలో ఏఐ ఆధారిత ర్యాలీతో నిధులు అటువైపు మళ్లుతున్నాయని గణాంకాలు వెల్లడించాయి.

పెట్రోల్ కార్ల కంటే ఈవీల రిపేర్ బిల్లులే భారం

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ) కొనుగోలు చేయడం పర్యావరణహితమే అయినప్పటికీ, సరైన బీమా తీసుకోకపోతే అది జేబుకు భారంగా మారే అవకాశం కూడా ఉందంటున్నాయి తాజా అధ్యయనాలు. సంప్రదాయ ఇంధన కార్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ కార్ల మరమ్మతు క్లెయిమ్ ఖర్చులు పెరుగుతుండటం, వాహన ధరలో సగానికి పైగా విలువ చేసే బ్యాటరీ ప్యాక్‌లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో ఈవీ ఇన్సూరెన్స్ విభాగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. కేవలం బేసిక్ పాలసీలపై ఆధారపడకుండా ఏకంగా 70 శాతానికి పైగా ఈవీ ఓనర్లు బ్యాటరీ ప్రొటెక్షన్, జీరో డిప్రిసియేషన్ వంటి ప్రత్యేక యాడ్‌ఆన్‌లను ఎంచుకుంటున్నారు. వర్షాకాలంలో ఎక్కువ నష్టాలు, ఇతర రిస్కులు, సరైన బీమా ఎంపికపై పాలసీబజార్ తాజాగా నివేదిక విడుదల చేసింది. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ కార్లతో పోలిస్తే ఈవీల మరమ్మతు క్లెయిమ్ ఖర్చులు సగటున 14 శాతం ఎక్కువగా ఉంటున్నాయని నివేదిక వెల్లడించింది. మొదటి మూడేళ్ల వ్యవధిలో రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల బడ్జెట్ ఉన్న కార్ల సగటు క్లెయిమ్ వ్యయం రూ. 36,185గా ఉండగా, ఎలక్ట్రిక్ కారుకు అది ఏకంగా రూ. 41,543గా నమోదైంది. అత్యంత ఖరీదైన బ్యాటరీ, సంక్లిష్టమైన సెన్సార్లు, విడిభాగాల మరమ్మతుకు తగినంత మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈవీల రిపేర్ బిల్లులు భారీగా పెరగడానికి ప్రధాన కారణాలని నివేదిక అభిప్రాయపడింది.

ధరలో సగానికి పైగా బ్యాటరీదే..

ఒక ఎలక్ట్రిక్ కారులో అత్యంత విలువైన భాగం దాని బ్యాటరీ ప్యాక్. వాహనం మొత్తం ధరలో దాదాపు 40 నుంచి 50 శాతం ఖర్చు కేవలం బ్యాటరీని రీప్లేస్ చేయడానికే అవుతుంది. దీంతో పాటు బ్యాటరీ కూలింగ్ సిస్టమ్స్, డ్యాష్‌బోర్డ్ ఎలక్ట్రానిక్స్ పాడైనా యజమానులకు ఊహించని రీతిలో పెద్ద బిల్లులు వస్తున్నాయి. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న ఈవీ ఓనర్లు కేవలం సాధారణ ప్రీమియంపైనే ఆధారపడకుండా అదనపు ప్రయోజనాలను ఎంచుకుంటున్నారు. గత ఆరు నెలల్లో బ్యాటరీ ప్రొటెక్షన్ కవర్ తీసుకుంటున్న ఈవీ వినియోగదారుల వాటా 51 శాతం నుంచి 70 శాతానికి పెరగడం ఈ ధోరణికి అద్దం పడుతోంది.

యాడ్-ఆన్లకు మొగ్గు..

ప్రస్తుతం దాదాపు 80 శాతం మంది ఈవీ కొనుగోలుదారులు కనీసం రెండు ప్రధాన యాడ్‌ఆన్ కవర్లను తమ పాలసీకి యాడ్ చేసుకుంటున్నారు. బ్యాటరీ ప్రొటెక్షన్, జీరో డిప్రిసియేషన్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్ (ఆర్ఎస్ఏ), కన్స్యూమబుల్స్ కవర్లు ఇందులో ముఖ్యమైనవి. కన్స్యూమబుల్స్ కవర్ కింద నట్స్, బోల్ట్స్, లూబ్రికెంట్లు వంటి అర్హత ఉన్న వస్తువుల ఖర్చులకు రక్షణ లభించవచ్చు. అయితే, అన్ని పాలసీల్లోనూ ఈ ప్రయోజనాలు ఒకేలా ఉండవు. అందువల్ల అదనపు ప్రీమియం ఎంత చెల్లించాలి, ఏ నష్టాలకు కవరేజ్ ఉంటుంది, ఏవి మినహాయింపుల పరిధిలోకి వస్తాయి అనే అంశాలను ముందుగానే తెలుసుకోవాలి. నీరు చేరడం వల్ల లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల బ్యాటరీ దెబ్బతింటే బ్యాటరీ ప్రొటెక్షన్ ఆదుకుంటుంది. అలాగే క్లెయిమ్ సమయంలో జీరో డిప్రిసియేషన్ కాపాడుతుంది. బీమా సంస్థను బట్టి ఈ కవరేజీ షరతులు మారుతుంటాయి కాబట్టి, పాలసీ తీసుకునే ముందే నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించడం అవసరం.

వర్షా కాలంలో ఈవీ క్లెయిమ్ బిల్లుల భారం..

వాతావరణ పరిస్థితులు కూడా ఈవీ క్లెయిమ్ ఖర్చులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఏడాది పొడవునా సగటున రూ. 52,000గా ఉండే ఈవీ క్లెయిమ్ వ్యయం, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవడం, వరదల కారణంగా ఏకంగా రూ. 65,000కి పెరుగుతోంది. అంటే వర్షాకాలంలో ఖర్చులు 25 శాతం దాకా పెరుగుతున్నాయి. ముఖ్యంగా అండర్ బాడీ డ్యామేజ్ లేదా వాటర్ లాగింగ్ వల్ల బ్యాటరీ దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. అందుకే నీరు చేరడం నుంచి రక్షణ కల్పించే ప్రత్యేక క్లాజులు తమ పాలసీలో ఉన్నాయో లేదో ఈవీ ఓనర్లు తప్పక చెక్ చేసుకోవాలి.

ఎస్‌యూవీలదే పైచేయి..

టైర్1 మెట్రో సిటీల కంటే టైర్2 పట్టణాల్లోనే ప్రతి 100 ఈవీలకు ఎక్కువ క్లెయిమ్‌లు (33) నమోదవుతున్నాయి. ప్రాంతాల వారీగా ఈస్ట్ ఇండియాలో అత్యధికంగా ప్రతి 100 వాహనాలకు 41 క్లెయిమ్‌లు రాగా, దక్షిణాదిలో తక్కువగా 27 నమోదయ్యాయి. ఇక దూర ప్రయాణాలు, హైవేలలో ఎక్కువ ఉపయోగించే ఈవీ ఎస్‌యూవీ మోడళ్లలోనే అత్యధికంగా 31 క్లెయిమ్ ఫ్రీక్వెన్సీ కనిపించింది. ఈ నేపథ్యంలో కేవలం చౌకైన ప్రీమియం మాత్రమే చూడకుండా, తమ వాహన వినియోగం, నివాసం ఉండే ప్రాంతంలో రోడ్డు పరిస్థితులకు అనుగుణంగా సరైన బీమా కవరేజ్ ఎంచుకోవడమే ఈవీ ఓనర్లకు ఉన్న ఏకైక పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.